క్లుప్తంగా

కోడిగుడ్డు ధర పైపైకి



దౌల్తాబాద్: సగటు మనిషి తన ఆహారంలో భాగంగా తీసుకునే కోడిగుడ్ల ధర పైపైకి ఎగబాకుతోంది. డజనుకు రూ.80కి పెరిగి, విడిగా ఒకదానికి రూ.7 పలుకుతోంది. మొన్నటి వరకు టోకున రూ.65 నుంచి రూ.70 ఉండి, చిల్లరగా రూ.6కు లభించేది. కానీ వారంలోనే పై విధంగా పెరిగి, వినియోగదారులను విస్మయానికి గురిచేస్తోంది. దీనికి కారణం వినియోగంతో పాటు కోళ్ల దానా ధరలు పెరగడమేనని ఫౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. కార్తీక మాసంలో మాంసాహార వినియోగం తక్కువగా ఉండడంతో ధరలు అదుపులో ఉన్నట్లు కనిపించినా.. అది ముగియడంతో చికెన్‌తో పాటు గుడ్ల ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలలో కిలో చికెన్ రేటు రూ.160 నుంచి 190లోపు ఉంది. ప్రస్తుతం రూ.250కి చేరింది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కూరగాయలతో పాటు ఇటు చికెన్, గుడ్ల ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు.

చెంచుల అభ్యున్నతికి 'పీఎం జన్మాన్'

మండల కోఆర్డినేటర్ బాల వరలక్ష్మి



చెంచులకు హెల్త్ కార్డు నమోదు పత్రాలను అందజేస్తున్న కోఆర్డినేటర్

కుల్కచర్ల: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను చెంచు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీఎం జన్మాన్ మండల కోఆర్డినేటర్, బండవెల్కిచర్ల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి బాల వరలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో చెంచుల కోసం హెల్త్ క్యాంపు, ఆధార్ నమోదు కేంద్రం, జన్‌ధన్ ఖాతాల ఓపెనింగ్, కేంద్ర పథకాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చెంచుల అభ్యున్నతికై కేంద్రం ప్రత్యేక కార్యాచరణతో పీఎం జన్మాన్‌ను తీసుకువచ్చిందని, వీటి గురించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరస్వామి, ఫారెస్ట్ ఆఫీసర్ స్వప్న, చెంచు సంఘం రాష్ట్ర కార్యదర్శి హన్మంతు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియామకం



ఖయూంకు నియామక పత్రం అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా ఖయూంను నియమించారు. ఈ మేరకు గురువారం సభాపతి ప్రసాద్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు స్థానిక మార్కెట్ యార్డ్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. మైనార్టీలను సంఘటితం చేస్తూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఖయూం మాట్లాడుతూ పార్టీ పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు, పార్టీ రాష్ట్ర నాయకులు రాములు యాదవ్‌కు, ఖలీమొద్దీన్, మల్లేశ్ యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, రామేశ్వర్, దివాకర్, పాండునాయక్, శేఖర్ యాదవ్, పాండురంగారెడ్డి, సర్వేశ్ ఉన్నారు.

ఆర్థిక సహాయం

దోమ: అనారోగ్యంతో బాధపడుతున్న దొంగ ఎన్కేపల్లి గ్రామానికి రూప్లానాయక్, పిల్లి బాబయ్యలకు పలువురి సహకారంతో సర్పంచ్ అశోక్‌రెడ్డి గురువారం చెరో రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు. అనంతరం మాట్లాడారు. బాధితుల పరిస్థితి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెల్లగా.. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తగిన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ప్రజలందరికీ అండగా..

కుల్కచర్ల: ప్రజలందరికీ ముదిరాజ్ సంఘం అండగా నిలుస్తుందని ఆ సంఘం అంతారం గ్రామ అధ్యక్షుడు శివరాములు అన్నారు. అంతారం గ్రామానికి చెందిన బోయిని లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న సంఘం సభ్యులు.. సంఘం ఆధ్వర్యంలో రూ.6,400లను తక్షణ సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం గ్రామ ఉపాధ్యక్షుడు బోయిని బచ్చయ్య, మాసయ్య, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు గోపాల్, ఉప సర్పంచ్ గోపాల్, వార్డు సభ్యుడు శంకర్, సంఘ నాయకులు మొగులయ్య, సాయన్న, రాంచంద్రయ్య, బాలకృష్ణయ్య, తాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అభయ హస్తానికి ఆదరణ

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ప్రారంభమై గురువారానికి ఆరు రోజులు అయినా.. అభయ హస్తానికి అర్హుల నుంచి అర్జీలు అనేకం వస్తున్నాయి. గడువు 6వ తేదీ సమీపిస్తుండటంతో గ్రామసభలకు ప్రజలు బారులు తీరుతుండగా.. అన్ని స్కీంలకు ఒకేఫారం కావడంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సులువుగా సాగుతోంది.

- రేపటితో ముగియనున్న గడువు
- కొనసాగుతున్న దరఖాస్తుల వెల్లువ
- కొత్తరేషన్ కార్డు అర్జీకి తెల్లకాగితమే..
- వివరాలు రాసిస్తే సరిపోతుందంటున్న అధికారులు
- ప్రజాపాలనను పరిశీలించిన కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్



ధారూరు: దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

ధారూరు: ధారూరు మండలం మున్నూరు సోమారం, ఎబ్బనూర్, తరిగోపుల, నాగ్‌సాన్‌పల్లి గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ప్రజాపాలనకు దరఖాస్తులు విరివిగా వస్తున్నాయి. పథకాల విషయం ఎలా ఉన్నా.. కొత్తగా రేషన్ కార్డు పొందేందుకు లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. గ్యారంటీ పథకాలకు ఇచ్చే ఫారంతో పాటే, తెల్ల కాగితంపై రేషన్‌కార్డు కోసం తమ వివరాలు వెల్లడిస్తే సరిపోతుందని చెప్పినప్పటికీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నారు. ఇదే విషయాన్ని గురువారం అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మున్నూరుసోమారంలో అవగాహన కల్పిస్తూ దరఖాస్తులు స్వీకరించారు.

నాలుగు జీపీల్లో 1,554

ధారూరు మండల పరిధి నాలుగు గ్రామ పంచాయతీల (ఎబ్బనూర్, మున్నూరుసోమారం, తరిగోపుల, నాగ్‌సాన్‌పల్లి) పరిధి 1,306 కుటుంబాల నుంచి గురువారం జరిగిన ప్రజాపాలనకు 1,554 దరఖాస్తులు అందాయి. ఇప్పటి వరకు మొత్తం 24 జీపీల్లోని 8,851 కుటుంబాల నుంచి 9,763 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూష, ఎంపీటీసీ రవీందర్, మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, ఎంపీఓ షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆరోరోజు 'గ్యారంటీ'కి స్పందన..

బొంరాస్‌పేట: గత నెల 28న ఆరంభమైన ప్రజాపాలన (అభయహస్తం) దరఖాస్తుల స్వీకరణకు ఆరోరోజు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. దుద్యాలలో తహసీల్దారు దానయ్య, బొంరాస్‌పేట మండల పరిధి గ్రామాల్లో తహసీల్దారు వెంకటేశ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్నగౌడ్‌లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.



తాండూరు రూరల్: ఐనెల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్ స్వప్నజ్యోతి

ఐనెల్లి, జినుగుర్తిలో..

తాండూరు రూరల్: సంక్షేమ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఐనెల్లి సర్పంచ్ స్వప్న జ్యోతి కోరారు. ఐనెల్లి, జినుగుర్తిలో జరిగిన ప్రజాపాలనను ఆమె సందర్శించి, ప్రజల నుంచి అర్జీలను తీసుకున్నారు. ఉప సర్పంచులు వెంకటేశ్, అసింఅలీ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, ధర్మది శ్రీను, రాంలింగారెడ్డి, శ్యామప్ప, శ్రీనుగౌడ్, అజ్మత్, ప్రవీణ్‌గౌడ్‌లు ఉన్నారు.

వినియోగించుకోండి..

కొడంగల్ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 8వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలనలో వారు మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోరుతూ అందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలో..

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ



కొడంగల్ రూరల్: దరఖాస్తులు తీసుకుంటున్న తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. చిట్లపల్లి, ఇందనూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఎంపీపీతో పాటు నియోజకవర్గ అధికారి, ఏపీడీ కృష్ణన్, తహసీల్దార్ బి.విజయకుమార్, మండల అధికారి స్టీవెన్ నీల్, సర్పంచులు వెంకట్‌రెడ్డి(చిట్లపల్లి), బాల్‌రెడ్డి (ఇందనూర్) పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియ

పరిగి: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీటీసీ ఉమాదేవి, సర్పంచ్ గోపాల్ సూచించారు. మండల పరిధి ఖుదాన్‌పూర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో పలువురి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రజాపాలనను ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తుందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వలస వెల్లిన వారు ఎలాంటి దిగులు చెందరాదని, తరువాత అర్జీ పెట్టుకున్నా పథకాలు అందుతాయని పేర్కొన్నారు.

నేడు కోట్‌మర్పల్లిలో

మర్పల్లి: కోట్‌మర్పల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాపాలన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిఖిల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో తహసీల్దార్ గణేశ్, తదితరులు ప్రజల



బొంరాస్‌పేట: తమవంతుకోసం..

నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు రాములు యాదవ్, మండల అధ్యక్షుడు రవిందర్‌లు రానున్నారని ఆయన వెల్లడించారు.

'గ్యారెంటీ'లు అమలు చేస్తాం

బషీరాబాద్: ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయడానికే ప్రభుత్వం ప్రజాపాలన తీసుకువచ్చిందని ఎంపీపీ కరుణ అన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మండల పరిధి క్యాద్గీరా, కొర్విచెడ్‌గని, కొర్విచెడ్, కొత్లాపూర్‌లో నిర్వహిస్తున్న గ్రామసభలను ఆమె సందర్శించారు. పలువురి నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని చెప్పారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, సర్పంచులు లక్ష్మి, సునీత, శోభారాణి, రవీందర్ పాల్గొన్నారు.

బంట్వారంలో...

బంట్వారం: ప్రజాపాలనకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పలువురి నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, ఆశాజ్యోతి, ఎంపీఓ విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ షిండే, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్ అర్బన్: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సొంత వార్డు 25లో నిర్వహించిన గ్రామ సభలో ఆమె పలువురి నుంచి అర్జీలను తీసుకున్నారు. అనంతరం న్యూ గాంధీ గంజ్, 21, 24, 26, 27వ వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లోనూ ఆమె పాల్గొన్నారు. ఇందులో మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, కమిషనర్ జకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: ఖుదాన్‌పూర్‌లో..



వికారాబాద్ అర్బన్: దరఖాస్తులు తీసుకుంటున్న చైర్‌పర్సన్ తదితరులు



బషీరాబాద్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి



బంట్వారం: సల్బత్తాపూర్‌లో..

తప్పులు లేకుండా నమోదు చేయాలి



ప్రజాపాలనలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తులను ఎలాంటి తప్పులు లేకుండా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ప్రజాపాలన నిర్వాహకులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. వికారాబాద్ మండల పరిధి అత్వెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామసభలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రిజిస్టర్లో నమోదు అంశాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. ఆరు గ్యారంటీల కోసం ప్రభుత్వం ఒకే ఫారాన్ని రూపొందించిందని, అందులోనే అన్ని వివరాలు ఉన్నాయని ప్రజలకు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ సుభాషిని, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీవో నాగరాజు పాల్గొన్నారు.

కారణం ఏదైనా తిరస్కరించొద్దు..



తిర్మలాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించాలని డీపీఓ తరుణ్‌కుమార్ అన్నారు. కుల్కచర్ల మండలం తిర్మలాపూర్, చెల్లాపూర్, ఘణపూర్ గ్రామాల్లో ప్రజాపాలనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ పథకాల కోసం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎటువంటి కారణాలతో తిరస్కరించకుండా.. స్వీకరించాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వం సూచించిన సూచనలు, నిబంధనలను అనుసరించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఖరీం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచులు వెంకటమ్మ (తిర్మలాపూర్), చంద్రయ్య(చెల్లాపూర్), విజయలక్ష్మి (ఘణాపూర్), డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, నాయకులు కుమ్మరి స్వామి, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తీరుమారకపోతే చర్యలు

మండల విద్యాధికారి వెంకటయ్య

తాండూరు రూరల్: విధులపట్ల ఉపాధ్యాయులు తీరు మార్చుకోకపోతే శాఖా పరమైన చర్యలకు వెనుకాడమని ఎంఈఓ వెంకటయ్య హెచ్చరించారు. గురువారం మండల పరిధి సిరిగిరిపేట్ ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. బడికి ఆలస్యంగా వస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌పై ఎంఈఓ సీరియస్ అయ్యారు. ప్రార్థన తర్వాత వస్తే, సీఎల్ వేయాలని హెచ్ఎంను ఆదేశించారు. టీచర్లు సమయపాలన పాటించడం లేదని పత్రికల్లో వస్తున్న వార్తా కథనాలపై ఎంఈఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. తీరు మార్చుకొని పని చేయాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతిరోజు పాఠశాలలను సందర్శిస్తానని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా.. బోర్డుపై తెలుగు, మ్యాథ్స్ రాసి చదవాలని విద్యార్థులకు సూచించగా.. వారు అన్ని ప్రశ్నలకు చక్కగా జవాబు చెప్పారు. దీంతో విద్యార్థులను ఆయన అభినందించారు.



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

అంధులకు ఆరాధ్య దైవం లూయిస్



బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్ అర్బన్: అంధులు విద్య ద్వారా సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంధులకు లూయిస్ ఆరాధ్య దైవమని, వారి కోసం కనుగొన్న లిపి ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం వారికి ప్రత్యేక పరికరాలు అందజేస్తుందని వెల్లడించారు. అంధ విద్యార్థులు.. సాధారణ వారికి తీసిపోకుండా.. విద్యలో మరింతగా రాణించేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి



ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యమ కారులు

పరిగి: తెలంగాణ ఏర్పడి 9సంవత్సరాలు గడుస్తున్నా.. ఉద్యమకారులకు ఎలాంటి పథకాలు అందలేదని, ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా నాయకుడు ముకుంద నగేష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 1200 మంది ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఆ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఆర్థిక సాయం చేయాలన్నారు. సంక్షేమ పథకాలను అందించాలన్నారు. అంతే కాకుండా నెలకు రూ.5వేల గౌరవ వేతనం, వారి పిల్లలకు గురుకులం, తదితర పాఠశాలల్లో 10శాతం సీట్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ముజీబ్, విద్యాసాగర్, నీరటి నరహరి, చిన్న మల్కయ్య, యాదగిరి, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు

చేవెళ్ల: విద్యార్థుల సమస్యలు పరిష్కరించి వారికి ఎల్లవేళలా అండగా ఉండేందుకు ఎస్ఎఫ్ఐ కృషి చేస్తోందని చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని పలు కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలోని సమస్యలపై నిరంతర పోరాటం చేసేందుకు ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. శివ, కుమార్, రావినారాయణ, రమ్య, ప్రియాంక పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి

కుల్కచర్ల: విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో పాఠ్యాంశాలను బోధించాలని అకాడమిక్ ప్యానెల్ కమిటీ హెడ్ జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను, వసతిగృహ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సరళమైన పద్ధతిలో పాఠాలు చెప్పాలని సూచించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని, విద్యావ్యవస్థలో పదో తరగతి అనేది పునాది వంటిదని, అందుకు 8వ తరగతి నుంచే ప్రత్యేక కార్యాచరణతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి దేవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్యానెల్ కమిటీ సభ్యులు

అయోధ్య అక్షింతల శోభాయాత్ర

కుల్కచర్ల: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన రాములవారి అక్షింతల శోభాయాత్రను మండల కేంద్రంలో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాం రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ సౌమ్యారెడ్డి, ఎంపీటీసీ ఆనందం స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న నేతలు

బస్సులను పునరుద్ధరించండి

వికారాబాద్ డిపో మేనేజర్‌కు గ్రామస్తుల వినతి

చేవెళ్ల: రెండేండ్ల నుంచి బస్సు సౌకర్యం నిలిపి వేశారని, మళ్లీ తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ తంగడపల్లి గ్రామస్తులు గురువారం వికారాబాద్ ఆర్టీసీ డిపోమేనేజర్‌కు వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి దాదాపు 50ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదన్నారు. కరోనా, లాక్‌డౌన్ కారణంగా బస్సును నిలిపి వేశారని ఆయన గుర్తు చేశారు. దాదాపు రెండేండ్లుగా గ్రామానికి వచ్చే బస్సు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులు గ్రహించి బస్సులను తిరిగి పునఃరుద్దిరించాలన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాల్లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగించుకోవడానికి మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుతం 3 కిలో మీటర్ల దూరంలోని కొత్తపల్లి టూ తలారం బస్సులో వచ్చి నడుచుకుంటూ గ్రామానికి వెళ్తున్నారన్నారు. తమ గ్రామం మండలానికి 15కిలో మీటర్ల దూరంలో ఉందని దీంతో తమకు రవాణ సౌకర్యాలు సక్రమంగా అందడంలేదన్నారు. తమ గ్రామం మీదుగా వికారాబాద్ టు హైదరాబాద్ రహదారికూడా ఉండడంతో ఈ మార్గంలో ఇటూ చేవెళ్ల, శంకర్‌పల్లి, అటూ వికారాబాద్ జిల్లాలోని పలు గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ డిపో అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని వారు కోరారు.



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న తంగడపల్లి గ్రామస్తులు